క్లుప్తంగా

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

సత్తెనపల్లి: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు జరుగుతాయని లైబ్రేరియన్ కె.వాణి ఆదివారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు కథలు వినడం, చదవడం, రాయడం, క్యారమ్స్, జనరల్ నాలెడ్జి, స్పోకెన్ ఇంగ్లీష్, ఇతర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వ బడుతుందన్నారు. ఆ అంశాలపై ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి గల రిటైర్డ్ ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. ఇతర వివరాలకు : 95152 59200 నంబర్లో సంప్రదించాలన్నారు.

రైలులో నుంచి కింద పడ్డ యువకుడు

సత్తెనపల్లి: రైలులో నుంచి యువకుడు కింద పడ్డ ఘటన పల్నాడు జిల్లా పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల రైల్వే గేటు వద్ద ఆదివారం జరిగింది. ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి అనుమానాస్పద స్థితిలో యువకుడు కింద పడ్డాడు. ఎవరో తనను కిందుకు తోసేశారని ఆరోపించాడు. యువకుడు పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుడు బండ్లగూడకు చెందిన షేక్ అబ్దుల్ మజీబ్‌గా గుర్తించారు.

తెలంగాణ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సత్తెనపల్లి: తెలంగాణ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పట్టణములోని భీమవరం రైల్వే గేటు వద్ద నుంచి రంగా కాలనీకి వెళ్లే రోడ్ మీద తెలంగాణ మద్యం బాటిల్స్ అమ్ముతున్నారనే సమాచారంతో సత్తెనపల్లి పట్టణ సీఐ యు. శోభన్ బాబు, సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ ఎ.రఘుపతి రావు సిబ్బంది దాడులు చేసి సత్తెనపల్లి టౌన్‌లోని సాదువమ్మ హాస్టల్ దగ్గర నివాసం ఉండే తేనీటి కొండలు అలియాస్ ఏడుకొండలు అలియాస్ అప్ప అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకుని అతని వద్ద నుంచి 5 తెలంగాణ రాష్ట్రానికి చెందిన క్వార్టర్ బాటిల్స్ స్వాధీన పరచుకున్నారు. తేనీటి కొండలును కోర్టులో హాజరు పరచగా కోర్టు ఉత్తర్వులు మేరకు నరసరావుపేట సబ్–జైలుకు తరలించారు.

రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల మృతి




రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ, ప్రస్తుత రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై గుంటూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. రామస్వామి 1989 -1999 వరకు పదేళ్ల పాటు ఆయన స్వగ్రామమైన బ్రాహ్మణపల్లికి సర్పంచ్‌గా పనిచేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2003 - 2005 వరకు రెండేళ్ల పాటు రాజుపాలెం మండలానికి ఎంపీపీగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాడు. ప్రస్తుతం రాష్ట్ర వడ్డెర కార్పొరేషన డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. రామస్వామి మృతి చెందిన వార్త తెలిసిన వెంటనే మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, తాడిశెట్టి మురళిలు వైద్యశాలకు వెళ్లి నివాళులర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో శ్రీఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోర్తాలవెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం



సత్తెనపల్లి: ఎడ్యుకేట్ ద సొసైటీ, సత్తెనపల్లి పోలీస్ వారి ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన తాగునీటి చలివేంద్రాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు షేక్ అన్సారీ, పట్టణ ఎస్ఐ ఏ.రఘుపతిరావు, మాజీ ఆర్మీ ఉద్యోగి ఎస్.ఎం సుబాని, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజ నారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, నాయకులు అచ్చుత శివప్రసాద్, రాయపాటి పురుషోత్తమరావు, దేవరశెట్టి రవి కుమార్, తలతల భాస్కరరెడ్డి, భరత్,వెంకీ, కొప్పురావూరి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

దూషించేందుకే చంద్రబాబు, పవన్ పర్యటనలు

- మంత్రి అంబటి రాంబాబు
- రూ.9.75 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని హోటల్ వ్యర్థాల నిర్వహణ ట్యాంక్‌లో పడి చనిపోయిన సంఘటనలో తురక గంగమ్మ సోదరుడు కుమారుడు కూడా మృతి చెందాడని, అయితే తన పై నిరాధార ఆరోపణలు చేసిన నేపధ్యంలోనే గంగమ్మకు సాయం చేస్తున్నారని .. ఆమె సోదరుడు కుమారుడు కుటుంబానికి ఎందుకు సాయం చేయట్లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ తనను దూషించేందుకే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లాంటి నేతలు సత్తెనపల్లి పర్యటనకు వస్తున్నారని విమర్శించారు. పార్టీని అమ్మకానికి పెట్టిన పవన్ కళ్యాణ్ గంగమ్మకు రూ. 4 లక్షల ఆర్థిక సహాయం చేస్తే ... పెద్ద పార్టీ అని చెప్పుకునే టీడీపీ, 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడు కేవలం రూ. 2 లక్షలే ఇవ్వడం దారుణమన్నారు. చంద్రబాబు కక్కుర్తి మనస్తత్వానికి ఇది నిదర్శనం అన్నారు. గంగమ్మ సోదరుడు పై వివక్షత ప్రదర్శించ కుండా సాయం చేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలో రైతులకు నష్ట పరిహార చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ విషయంలోనూ తాను ఎన్నడూ అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. రూ. 9.75 లక్షల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను మంత్రి అంబటి రాంబాబు పంపిణీ చేశారు. నకరికల్లు మండలం గుండ్లపల్లి, చీమలమర్రి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో సమావేశంలో రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమ రావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, నకరికల్లు మండల జెసిఎస్ ఇన్చార్జి, వైస్ ఎంపీపీ ప్రవీణ్ రెడ్డి, ధూళిపాళ్ల సొసైటీ చైర్మన్ శివన్నారాయణ, సంకటి శ్యాంసన్, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకా జయపాల్ తదితరులు ఉన్నారు.

సత్తెనపల్లి మండలంలో 56.63 శాతం ఉత్తీర్ణత

సత్తెనపల్లి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తెనపల్లి మండలంలోని జిల్లా పరిషత్, ఏజీబీవీ, గురుకులాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మండలంలో 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ బాల, బాలికల గురుకుల పాఠశాలలు, మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, కేజీబీవీలో కలిపి మొత్తం 1,208 మంది విద్యార్థులకు గాను 1,199 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయగా 679 మంది ఉత్తీర్ణులయ్యారు. 56.63 శాతం ఉత్తీర్ణత నమో దైనట్లు మండల విద్యాశాఖాధికారి ఏ.శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలల వారీగా వివరాలు ఇలా...

- మహాత్మ జ్యోతిరావు పూలే ఏపీ బిడబ్ల్యూఆర్ పాఠశాలలో 39 మంది విద్యార్థులు పరీక్ష రాయిగా 33 మంది ఉత్తీర్ణయ్యారు 84.62 శాతం అత్యధిక ఉత్తీర్ణత మండలంలో ఈ పాఠశాల నమోదు చేసుకుంది. ఈ పాఠశాలకు చెందిన మల్లాది గౌతమి 566 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- లక్కరాజుగార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 75 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 57 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 76 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకోగా ఈ పాఠశాలకు చెందిన ఫిరంగిపురం మండలం యర్రగుంటపాడు గ్రామానికి చెందిన గుత్తికొండ శివ మాధవరెడ్డి 590 మార్కులతో జిల్లాలోనే ప్రథముడి గా నిలిచాడు.
- బృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 105 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 77 మంది ఉత్తీర్ణులయ్యారు 73.33 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా పాఠశాలకు చెందిన అంబటి బాల సుష్మ 560 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 55 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 39 మంది ఉత్తీర్ణయ్యారు. 70.91 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పాఠశాల నుంచి కె.ఎస్.ఇంద్రజ 529 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 26 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 18 మంది ఉత్తీర్ణయ్యారు. 70.91 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పాఠశాల నుంచి కె.ఎస్.ఇంద్రజ 529 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- రామకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల నుంచి 83 మంది విద్యార్థినిలు పరీక్ష రాయగా 57 మంది ఉత్తీర్ణులయ్యారు. 68.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది.ఈ గురుకులం నుంచి పీ.శరణ్య 523 మార్కులతో గురుకులం టాపర్‌గా నిలిచింది.
- వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 31 మంది పరీక్ష రాయగా 21 మంది ఉత్తీర్ణులయ్యారు. 67.74 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ పాఠశాల నుంచి జి.నాగ భువనేశ్వరి 483 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- రెంటపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 61 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 41 మంది ఉత్తీర్ణులయ్యారు. 67.21 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పాఠశాల నుంచి సిహెచ్ కళ్యాణి 544 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- కట్టమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 39 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 26 మంది ఉత్తీర్ణులయ్యారు. 66.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పాఠశాలకు చెందిన శీలపోగు లావణ్య 511 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. -ధూళిపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 49 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 32 మంది ఉత్తీర్ణులయ్యారు. 65.31 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ పాఠశాల నుంచి పి నిఖిత 535 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- ఫణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 63 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 35 మంది ఉత్తీర్ణులయ్యారు. 55.55 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ పాఠశాల నుంచి నిమ్మగడ్డ దీప్తి శ్రీ 576 మార్కులతో పాఠశాల టాపర్‌గా, మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచింది.
- సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి 146 మంది పరీక్ష రాయగా 76 మంది ఉత్తీర్ణులయ్యారు. 52.05 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ పాఠశాల నుంచి ఆసుల ఇందు మాధురి ఇంగ్లీష్ మీడియం లో 573 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- పెదమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 39 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 20 మంది ఉత్తీర్ణులయ్యారు. 51.28 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ పాఠశాల నుంచి కె హరిహరన్ 491 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచాడు. -సత్తెనపల్లి సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 158 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 73 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 46.20 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ పాఠశాల నుంచి నల్లబోతు లక్ష్మీనరసింహ స్వామి 575 మార్కులతో పాఠశాల టాపర్గ్, మండలంలో తృతీయ స్థానంలో నిలిచాడు.
- సత్తెనపల్లి కేజీబీవీ పాఠశాల నుంచి 35 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా 16 మంది ఉత్తీర్ణులయ్యారు. 45.71 శాతం ఉత్తీర్ణ నమోదదైంది. ఈ పాఠశాల నుంచి బి దీవెన మేరీ 564 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 98 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 31 మంది ఉత్తీర్ణులయ్యారు. 31.63 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ పాఠశాల నుంచి ఆకారపు యవనిక 574 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- అబ్బూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 35 మంది పరీక్ష రాయగా 10మంది ఉత్తీర్ణులయ్యారు. 28.57 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ పాఠశాల నుంచి రాచంశెట్టి గాయత్రి 479 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది.
- రామకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల నుంచి 62 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 16 మంది ఉత్తీర్ణులయ్యారు. 25.81 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఈ పాఠశాల నుంచి బి.నానాజీ నాయక్ 532 మార్కులతో గురుకులం టాపర్‌గా నిలిచాడు.

ఎమ్మెల్యే శంకరరావు దంపతులు ప్రత్యేక పూజలు



ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు

అమరావతి: మండల పరిధిలోని ఉంగుటూరు గ్రామంలో కొలువై ఉన్న గుండవరపు వీరాంజనేయ స్వామి పునఃప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులందరి సహకారంతో వీరాంజనేయస్వామివారి అలయాన్ని పునఃనిర్మాణం చేయటం అనందంగా ఉందన్నారు. అలాగే స్వామివారి ఆశీస్సులతో పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో పాడిపం టలతో జీవించాలని కోరుకున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల వార్షికోత్సవం

నాగవరం(క్రోసూరు): మండలంలోని నాగవరం గ్రామంలో కొలువై ఉన్న నాగేంద్రస్వామి, నిదానంపాటి శ్రీలక్ష్మీఅమ్మవారు, రేణుకా ఎల్లమ్మతల్లి వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరై దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెంలో ఆదివారం శ్రీ గంగమ్మ తల్లి, పోతురాజుస్వామి, వేణుగోపాల స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. గ్రామంలో గ్రామస్తులు అందరూ ఐక్యంగా ఆలయాలను నిర్మించి, ఆదివారం విగ్రహాలను ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం నుంచి ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని, దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

మొసళ్లు ఉన్నాయ్..జాగ్రత్త



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు మొదలుకుని కృష్ణానది తీరంలో మొసళ్లు, లోతైన గుంతలు ఉన్నాయని, స్నానాలకు, ఈత కొట్టేందుకు నదిలోకి ఎవరూ దిగవద్దంటూ పల్నాడు జిల్లా ఎస్పీ, సబ్‌డివిజనల్ పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులను ఉంచినట్లు అచ్చంపేట ఎస్ఐ కె.పాల్ రవీంద్ర ఆదివారం తెలిపారు. వేసవి సెలవులను పురస్కరించుకుని చాలా మంది విద్యార్థులు ఇళ్ల వద్ద ఉంటూ సరదాగా పులిచింతల ప్రాజెక్టు సందర్శనకు వెళ్లి, అక్కడి నుంచి కృష్ణానదిలో ఈతకొట్టేందుకు, స్నానాలు చేసేందుకు దిగుతుంటారని, అలా దిగవడం వల్ల ప్రమాదం పొంచి ఉందని ఎస్.ఐ తెలిపారు. నదిలో లోతైన గోతులతో పాటు ఈ మధ్యకాలంలో మొసళ్లుకూడా సంచరిస్తున్నట్లు చెప్పారు. పులిచింతల ప్రాజెక్టు మొదలుకుని కృష్ణానది తీర గ్రామాలైన మాదిపాడు, గింజుపల్లి, చల్లగరిగ, తాడువాయి, సంద్రతండా, పుట్లగూడెం, చింతపల్లి, చామర్రు, కోగంటివారిపాలెం, అంబడిపూడి, కోనూరు, కస్తల అమరావతి మండలంలోని దిడుగు, ముత్తాయపాలెం, ధరణికోట, అమరావతి, వైకుంఠపురం తదితం తీరప్రాంతాలలో ప్రమాద గుర్తులు, హెచ్చరిక బోర్డులను ఉంచినట్లు చెప్పారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను నదిలోకి పంపవద్దని, ప్రమాదాలు కొనతెచ్చుకొని, నిండు ప్రాణాలు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

క్రోసూరు: పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకరరెడ్డి ఆదేశాల మేరకు వేసవి సెలవుల్లో తమతమ పిల్లలను కృష్ణానది తీరప్రాంతాలకు ఈతలకు, స్నానాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ మణికృష్ణ ఆదివారం కోరారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ వేసవి సెలవులు పురస్కరించుకుని చాలా మంది పిల్లలు, కాలేజీ విద్యార్థులు ఇళ్ల వద్ద ఉంటూ, మరికొందరు సెలవులకు ఇతర ఊర్ల నుంచి వచ్చి సరదాగా వేసవితాపానికి, కొందరు తెలియక నది ప్రాంతాల్లో ఈతలకు వెళ్తుంటారన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతాలైన పులిచింతల, ప్రమాదగుర్తులు బోర్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

దంతాల పరిశుభ్రంతో రుగ్మతలు దూరం

సత్తెనపల్లి: దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రుగ్మతలు దూరమై ఆరోగ్యవంతంగా ఉండగలుగుతారని దంత వైద్య నిపుణుడు డాక్టర్ పోసాని ప్రసన్నకుమార్ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని ఎన్జీవోహోం సెంటర్‌లో గల రవి తేజస్వి దంత వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన శిబిరంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ పోసాని ప్రసన్న కుమార్ మాట్లాడుతూ అందరికీ ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. దంతాలను అమర్చడము, అప్పటికప్పుడే ఎక్సరే ద్వారా ఒకే సిట్టింగ్ లో రూట్ కెనాల్ చికిత్స, ఎత్తు, వంకర పళ్ళు, సరి చేయడం కోసం అత్యాధునికమైన పద్ధతిలో క్లిప్స్ ట్రీట్మెంట్ అందుబాటులోకి రానుందన్నారు. ఈ నెల 8 నుంచి 'ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీమ్' (ప్రభుత్వం ద్వారా ఏ ఖర్చు లేకుండా ఉద్యోగులకు దంతాలకు సంబంధించి అన్ని రకాల సేవలు) ప్రారంభించబడుతుందని, ప్రతి ఒక్క ఉద్యోగి కూడా ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్ట్ 'హెల్త్ కార్డు' గల ప్రతి ఒక్క జర్నలిస్టుకు వైద్యము చేయబడుతుందని, అదే విధంగా సామాన్య ప్రజలకు అత్యాధునిక సేవలు అందుబాటులోనికి రానున్నాయని తెలిపారు. యువతకు సమస్యగా ఉన్నటు వంటి పంటి వరసలు సరిచేస్తూ 'స్మైల్ డిజైనింగ్' చేయడం ద్వారా చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సదవకాశాన్ని యువత వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉండాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా చేసిన అభివృద్ధిని, పేదలకు అందించిన సంక్షేమాన్ని చూసి మరలా జగనన్నకు అండగా నిలవాలని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు మండల పరిధిలోని కంభంపాడులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో కొంతమేర సైడ్‌కాల్వలు ఉన్నాయని, కొన్ని రోడ్లలో సైడ్‌కాల్వలు కట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే అధికారులను అంచనాలు తయారుచేయాలని ఆదేశించారు. రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరులో వివక్ష చూపకుండా అర్హులైన వారందరికి కేటాయించాలని రెవెన్యూ అధికారులకు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలు వింటూ వాటికి అధికారులతో చర్చించి వెంటనే పరిష్కారాలను సూచిస్తూ ముందుకు సాగారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ పార్టీలు, వర్గాలు, కులమతాలు చూడకుండా అర్హతతోనే లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని గర్వంగా ఇంటింటికి తిరిగి చెబుతున్నామన్నారు. గత మూడేళ్ళలో కరోనా సంక్షోభంలోను ముఖ్యమంత్రి అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి ఆశీర్వదించాలన్నారు. ప్రతిపక్షాలు గాలిపోగుచేసి చేసే విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వారికి ప్రజల అభివృద్ధి, సంక్షేమం పట్టదని విమర్శించడం ఒక్కటే పనిగా పెట్టుకున్నారన్నారు. కంభంపాడులో ఆదివారం నాడు 300 గడపలను సందర్శించి వారికి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించి జగనన్నను, తనను ఆశీర్వదించమని కోరారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, గ్రామ సర్పంచ్ అర్తిమళ్ళ నాగేశ్వరరావు, ఎంపీటీసీ అర్తిమళ్ళ అంజమ్మ, సొసైటీ డైరెక్టర్ మస్తాన్‌రావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు షరీఫ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కంకణాల శివాజీ, తదితరులతో పాటుగాపలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానించిన మంత్రి అంబటి



టెన్త్ టాపర్ శివమాధవరెడ్డి, అవ్వారు తేజను సత్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రశంసించి, ఘనంగా సన్మానించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సర్కారు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లా స్థాయిలో ముందు వరసలో ఉండడం స్ఫూర్తివంతమన్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలల పనితీరుకు, రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషికి నిదర్శనమన్నారు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభ్యసించిన ఫిరంగిపురం మండలం యర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన గుత్తికొండ శివ మాధవ్ రెడ్డి 590 మార్కులు సాధించి పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. పట్టణంలోని 19వ వార్డుకు చెందిన లిటిల్ ఏంజిల్స్ విద్యార్థి అవ్వారు పవన్ తేజకు 581 మార్కులు రావడం పట్ల వీరిద్దరిని ఆయన ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు కుమారుడు అవ్వారు తేజ ను పలువురు అభినందించారు. కార్యక్రమం లో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకా జయపాల్, శివాపరపు రామారావు, లోకా మాధవ్, గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, తది తరులు ఉన్నారు.

నాభిశిల, పోలేరమ్మ, ఆంజనేయ స్వామి పున:ప్రతిష్ట



ప్రత్యేక పూజల్లో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండల పరిధిలోని కట్టవారిపాలెం గ్రామంలో జరిగిన బొడ్రాయి (నాభిసిల), పోలేరమ్మ, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ పునఃప్రతిష్ట ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణలు హాజరయ్యారు. మంత్రి అంబటి రాంబాబుకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మదమంచి రాంబాబు నేతృత్వంలో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రైతు సలహా మండలి రాష్ట్ర సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, స్థానిక నాయకులు మదమంచి రాంబాబు, ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలుకా జయపాల్, ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక పెద్దలు, పార్టీ నాయకులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

జిల్లా వ్యవసాయాధికారి మురళి



రైతుల గుర్తింపు ప్రక్రియను పరిశీలిస్తున్న, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, ఏఓ దేవదాసు

నకరికల్లు: పంటనష్టం వాటిల్లిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి అన్నారు. మండలంలోని దేచవరం గ్రామంలో పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. నష్టపోయిన రైతుల గుర్తింపు ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. ఎన్యూమరేషన్ సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాలవర్షానికి పంటనష్టపోయిన రైతులు రైతు భరోసాకేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రైతుభరోసాకేంద్రాల్లో 75 కేజీల ధాన్యం బస్తాకు రూ.1,545లు మద్దతుధర ఇస్తున్నట్లు తెలిపారు. హమాలీల ఖర్చు, రవాణాఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మొక్కజొన్న పంట అమ్ముదలుచుకున్న రైతులు రైతు భరోసాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.రవిబాబు, గడ్డం జగదీష్, షేక్.సుభాని, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని శ్రీనీలంపాటిశ్రీ లక్ష్మీ అమ్మవారి తిరునాళ్లమహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా తెల్లవారు జామున 5 గంటల నుంచి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమబళ్ళు ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ పీలాగాయత్రి, పీలాలక్ష్మణ్, ముప్పాళ్ళ, కుందురువారిపాలెం సర్పంచ్‌లు సతీష్, చయికంవెంకటప్పారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రెండెద్దులవెంకటేశ్వరరెడ్డి,ముప్పాళ్ళ సొసైటీ అధ్యక్షుడు అన్నపరెడ్డి సాయిరెడ్డి, బ్రహ్మారెడ్డి, లక్ష్మీరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా లింగమయ్య స్వామి తిరునాళ్ల....

మండలంలోని చాగంటివారిపాలెంలోని లింగమయ్యస్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు స్వామికి పొంగళ్ళు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలి



సత్తెనపల్లి: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలని కమ్యూనిటీ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డెప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాద్ అన్నారు. అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పేద మహిళలకు నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమర్‌నాద్ మాట్లాడుతూ పేద కుటుంబాలను గుర్తించి వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీకి తన సహాయ, సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. సొసైటీ ప్రెసిడెంట్, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, సభ్యులు సిద్దెల వేణు బాబు, గొట్టం వెంకటేష్, కోనేటి ఏసుబాబు, కాటేపల్లి చంద్రశేఖర్, పిక్కిలి రత్తయ్య, చింకా అంకమ్మ రావు, పి.వెంకటేష్, క్యాలీబర్ జానీ, వెంకటేశ్వర్లు ,సలీమ్, సురేష్ ఉన్నారు.

